కులమా? ప్రేమా?

యల్లాప్రగడ సీతాకుమారిగారు

౧

విర్జాను చూస్తే నాకు మొదటినుంచీ చాలా ఆదరం. నిరాడంబరమైన అతని మాటలు, వేషము అంటే నాకు చాలా ఇష్టం. ఏవిషయాన్ని గురించి మాట్లాడుతున్నా అతను, భావపూరితంగా ఉండేదికాని ఉత్త చెత్తగా ఉండేది కాదు. మహమ్మదెన్సులో సాధారణంగా కనుపించే అహంకారం, బడాయి విర్జావద్ద కనుపించేవి కావు. అన్నిటికంటె ముఖ్యవిషయ మేమిటంటే విర్జా శాకాహారి. మాఇద్దరికి ఎమ్. యస్. సి. లాస్టియ రిప్పుడు. విర్జాకు నాకంటె రెండే క్లాసులెక్కువుంటా యనుకుంటాను. సాయంకాలమప్పుడు మే మిద్దరం కలిసే ఏగార్డెన్‌లోకన్నా వెళ్లి చదువుకుంటుండేవాళ్లం.

ఆదివారం ఇవ్వాళ. నాన్నగారికి కోర్టులేదు. గదిలో పడుకొని నిద్రపోతున్నారు. నేను హాల్లో ఈజీ చైరులో పడుకొని కెమిస్ట్రీబుక్కేదో చూచుకుంటున్నాను. కొద్దిగా తలనొప్పిగా ఉంది. పుస్తకం కుర్చీ చేతిమీద పెట్టి ఏదో ఆలోచిస్తూ పడుకున్నాను. 'శంపా' అని లోపలినుండి మాఅమ్మ పిలిచింది.

"ఓవల్‌టీను అక్కడికి తీసుకురానా? లోపలికి వస్తావా?"

"లోపలికి వస్తాలే. నాన్నగారు లేచారా?" అంటూ లేచి వెళ్లాను లోపలికి.

నాన్నగారు బారిష్టరుపరీక్షకు ఇంగ్లండు వెళ్లి వచ్చారు గనుక సివిలిజేషన్ కేమీ తక్కువ ఉండదు, ఇంట్లో. అయినప్పటికి రెలిజన్‌అంటే చాలా పట్టుదల వారికి. హిందూమతంలో కొన్నిలోపా లున్నాయని ఒప్పుకొనకమానరుకాని ఆ చిన్న లోపాలను సంస్కరించివేస్తే హిందూమతమంత గొప్పమత ముండదని తరచుగా అంటూఉంటారు. దానికి తగినట్లే అమ్మకూడ మరీ ప్రాచీనకాలపు మనిషికాదు. ఆమెకు ఇంగ్లీషు బాగా రాకపోయినా తెలుగు బాగా చదువుకుంది. తెలుగులైబ్రరీ అంతా రెండుసార్లు తిరగవేసింది. వివిధదేశమతాలనూ, రాజకీయాలనూ, ఆర్థికాలనూగురించి చాలాపుస్తకాలు చదివింది. సైన్సుకూడ చాలాభాగం తెలుసు. కనుకనే నాన్నగారికి, ఆమెకు భావాల్లో ఏమీ భేదంలేక సంసారం ప్రశాంతంగా జరిగిపోతూఉంటుంది. స్త్రీస్వాతంత్ర్యంవిషయంలో తరచుగా తర్కవితర్కాలు జరుగుతూఉంటయి. మగవాళ్లు ఎంత మంచివాళ్లయినా స్త్రీలకు ప్రత్యేకపుటాస్తి ఏమీ లేకపోతే పూర్తిగా స్వాతంత్ర్యం ఉండదని అమ్మ తరచుగా అంటూ ఉంటుంది. ఆడవాళ్లలో బ్రహ్మచారిణులుగా చాలామంది ఉండాలని అమ్మకు ఇష్టం. ఐతే నాన్నగారికి బ్రహ్మచర్యం అంటే ఇష్టంలేదు. ఆడవాళ్లకే నిగ్రహశక్తి, సహనం ఎక్కువఅని ఆమెవాదం. ఈలాటి తర్కాలతోటే మాఇంట్లో ఆనందంగా గడిచిపోతూఉంటుంది.

డైనింగు టేబిలువద్ద నాన్నగారు కనిపెట్టుకొని కూర్చున్నారు. నేనుకూడ ఒకకుర్చీ దగ్గిరకు లాక్కొని కూర్చున్నాను. "ఫాల్గుణమాసంలోనే ఇంత ఎండలు మండిపోతున్నాయి" అంటూ అమ్మ కొన్ని బిస్కట్సుబిట్సు

ఉన్న ప్లేటు బల్లమీదపెట్టి ఇంకొక కుర్చీలో కూర్చున్నది. మేమిద్దరం చెరి ఒక బిస్కటూ తీసికొని తింటున్నాం. ఓవల్‌టీనులో ఐస్ వేసి ముగ్గురికి మూడుకప్పులు బల్లమీద పెట్టింది, అమ్మ.

వాకిట్లో సైకిల్ బెల్ మ్రోగింది. "మిస్ శంపాలత ఉన్నదా, ఇంట్లో?"—ఆధ్వని నాకు చిరపరిచితమే. "హల్లో, మిష్టరు మీర్జా" అంటూ లేచాను, చీర కుచ్చిళ్లు కాళ్లకింద పడుతూ. "ఎవరమ్మడూ అతను?" అన్నారు నాన్నగారు. "నాక్లాస్ మేటండీ, డాక్టరు ఉస్మాన్‌జాగారి కొడుకు". "ఉస్మాన్‌జాగారి అబ్బాయా, రమ్మను లోపలికి." ఉస్మాన్‌జాగారికి, నాన్నగారికి ఎక్కువ పరిచయం లేదుగాని ఇద్దరు కార్పొరేషన్ మెంబర్లే అవటంచేత ఎరుకమాత్రమున్నది. నేనువెళ్లి మీర్జాను లోపలికి తీసుకువచ్చాను. అమ్మ ఇంకొకకప్పులో ఓవల్ టీను వేసి కలిపింది. మాయింట్లో ఇంతసోషల్‌గా ఉండడం చూచి మీర్జా చాలా సంతోషించాడు అందరము ఓట్సుతినడం మొదలుపెట్టాం.

"ఇవ్వాళ టాకీలో మంచి ఫిలిం ఉందిటే-అన్నాడు మీర్జా ఓవల్‌టీన్ తీసుకుంటూ"

"ఇవ్వాళ టాకీలో చాలామంచి ఫిలిం ఉందిటే" అన్నాడు మీర్జా, ఓవల్‌టీను తీసుకుంటూ.

"వెళ్లుతావా ఏమిటి?"

"నీవుకూడా వస్తావా?"

"బాగా ఉంటే మా అమ్మనుకూడ తీసుకువస్తాను."

అమ్మ తల ఎగురవేసింది. నాన్నగారు ఏమీ మాట్లాడలేదు. తరువాత కాలేజీలో సంగతులు చాలా మాట్లాడుకున్నాం, ఇంగ్లీషులో. నాన్నగారు సరదాగా వింటూ ఉన్నారు. అమ్మ మీర్జావైపు, నావైపు చూస్తూ ఓవల్‌టీను త్రాగడం ముగించింది. అందరం లేచాం. మీర్జాను పంపడానికి నేనుకూడ వాకిట్లోకి వెళ్లుతూ ఉన్నాను. "తురకవాళ్ల పిల్లవాడా ఏమిటి ఇతను?" వెనుక వినపడ్డది, అమ్మ అంటుంటే. "లేకపోతే శంపా, ఇతనూ ఈడూజోడూను." నాన్నగారేమీ అన్నట్టు లేదు.

౨

ఆరింటికల్లా వచ్చాడు మీర్జా, ఫుల్ ఖాదీడ్రెస్‌లోనే. అసలు వాళ్లకుటుంబమంతా మావలెనే ఎక్కువ ఖాదీనే వాడుతారు. నేను, అమ్మకూడ ఖద్దరు చీరలే కట్టుకున్నాం. ముగ్గురం బయలుదేరాం కారులో.

టాకీస్‌అంటే సినిమాలంత విసుగుపుట్టలేదు గనుక మనవాళ్లకి, చాలాభాగం హాలంతా నిండే ఉంది. మేము వెళ్లి రిజర్వ్‌డ్ బాక్సులో కూర్చున్నాము. కథ "లవ్ ఆఫ్ ఇంగ్లండు". అమ్మకు వాళ్ల ఆడవాళ్ల స్వాతంత్ర్యం చూస్తే చాలా సంతోషం. ఆమెకు తెలియనప్పుడల్లా కథ నేను చెప్పుతుండేదాన్ని. మిస్ జోసఫ్ సందర్భానుసారంగా చూపిన ధైర్యం, సాహసం, నటనాకౌశలం చూచి అమ్మ చాలా ముగ్ధురాలయిపోయింది. జానిస్ క్షణానికి ఒకణ్ణి ప్రేమిస్తూ కొద్దిరోజుల్లోనే వదలివెయ్యడం, మళ్లీ ఇంకొణ్ణి ప్రేమించడం చూచి చాలా విసుక్కున్నది. మొత్తంమీద యాక్టర్సంతా బాగానే

ఉన్నారు. కథ చాలా పెద్దది. పదకొండు రీల్సు ఉన్నాయి. ఆట పూర్తి అయ్యేటప్పటికి తొమ్మిదిన్నర అయింది...

కారుచప్పుడు విని నాన్నగారు బయటకు వచ్చి, "ఇంతసేపున్నారేం? దోవలో ఎక్కడన్నా కారు చెడిపోయిందాఏమి?" అన్నారు. "లేదండీ చాలా పెద్దఫిలుం" అంటూ మీర్జా కిందికి దిగాడు. "అంతేకదా" అన్నారు చిరునవ్వుతో, నాన్నగారు. "చాలా ప్రొద్దుపోయింది. పోనీ, ఈపూట కిక్కడ భోంచేసి వెళ్లు."

మీర్జా తెలుగు బాగామాట్లాడగలడు. "ఎందుకులెండి, త్వరలోనేవెళ్లగలను, బైసికులుమీద" అన్నాడు. నేనుకూడ దగ్గిరకువెళ్లి "ఉండరాదూ? సరదాగా అందరం భోంచేద్దాం." అన్నాను. నాన్నగారుకూడ ప్రెస్ చేశారు. చివరకు మాట తీసివేయలేకపోయినాడు, మీర్జా. ఆపూట కందరం కలిసి భోంచేశాము. తరువాత నాన్నగారు డ్రైవరును పిలిచి మీర్జాను కారులో ఇంటివద్ద విడచిరమ్మని చెప్పారు.

3

బెడ్ రూములోకి వెళ్లి పడుకున్నాను. కాని వేళ తప్పిపోవటంవల్ల వెంటనే నిద్రపట్టలేదు. చాలాసేపటివరకు సినిమాలో సంగతులే ఆలోచిస్తూ పడుకున్నాను. ఎప్పుడో నాకు తెలియకుండానే నిద్రపట్టింది. కాని గాఢమైన నిద్రకాదు. కలతగా ఉంది. అందులో ఒక గమ్మత్తయిన కల.—

చాలావేగంగా పోతున్నది ఎయిరోప్లేన్. అందులో నేను, మీర్జా ఇద్దరమే ఉన్నాం. నడిపేవాడెవ్వడుకూడా లేడు. కాని మా ఇద్దరిలో నెవ్వరమూ నడపడం లేదు. కొంతసేపటికి దానంతట అదే ఒకచోట ఆగింది. ఇద్దరం కిందికి దిగిచూచాం. అది ఒక కొండలమీది వనప్రదేశం. చాలా ఎత్తుగా ఉన్న కొండ శిఖరాలు—సాయంకాలపు సూర్యకిరణాలు పడి మెరుస్తూ ఉన్నాయి. విశాలమైన పచ్చికబయళ్లలో గడ్డిపూలు మృదువైన వాసనకొట్టుతూ ఉన్నయి. దణదణమని శబ్దంచేస్తూ సన్నని పిల్లకాలువలు గులకరాళ్ల మీద తాచుపాముల్లాగ పరుగెత్తుతున్నాయి. ఎటువైపు చూచినా స్వాభావికమైన ప్రకృతిసౌందర్యం ముంచివేసింది మమ్మల్ని.

నేను ఒక్కసారి అదంతా చుట్టివచ్చాను. అంతటితో చాలా అలసిపోయినాను. వెంటనే అక్కడనున్న ఒక కొండరాతిమీద కూర్చున్నాను. ఇదంతా ఎప్పుడూ చూడని తమాషాకొత్తచోటే. బహుశా కైలాసపర్వతమేమో అన్న ఊహ తోచింది. వెనుకనుంచి మీర్జా వచ్చి తన రెండుచేతులతో నామెడ చుట్టివేసి "శంపా" అని తనవైపుకు తిప్పుకుని నానుదురుమీద ముద్దుపెట్టుకున్నాడు. నాకు కొంచెము సంకోచము వేసింది. మీర్జాను అవతలకు నెట్టివేయవలె ననుకొన్నాను. కాని చెప్పడానికి వీల్లేని ఒక శక్తిలాటి దేదో నన్ను అతనిలోకి నెట్టుతున్న ట్టనిపించింది. సంకోచిస్తూనే నేనుగూడా ఆగుండ్రని మృదువైన చేతుల్ని గట్టిగా పట్టుకొని, ఆపలుచగా నున్నగా నుండే చెంపమీద ఒక చిన్నముద్దు పెట్టుకొన్నాను. "చూడు, శంపా, ఇటు చూడు. అలా సంకోచిస్తావేం? ఎన్నాళ్లనించో నీవు నాదాని వైపోవాలని విపరీతమైన ఆశపెట్టుకొనిఉన్నాను. నీకు, నాకు మధ్య ఏడు సముద్రాలు వచ్చినా గడిచేసి నిన్ను నాదాన్నిగా చేసుకోగలను. అట్లాంటిది మతమా వచ్చేది అడ్డం?" అన్నాడు. ఆమెరిసేపెద్దకోలకండ్లల్లో నీళ్లు తిరుగుతున్న ట్లనిపించింది. నాకు ఎలా మాట్లాడాలో తెలీలేదు. ఇంకా గట్టిగా మీర్జాను గుండెల్లో అదుముకున్నాను. నాకు చైతన్యం లేన ట్టనిపించింది. మీర్జాలో విలీన మైపోయినాను.—

కిటికీలోనుంచి వానజల్లు వచ్చి పడుతున్నది. ఉలికిపడి లేచాను. బయట దణదణమని వాన కురుస్తున్నది. తటాలున కిటికీతలుపులు మూసివేసి కండ్లు నులుముకుంటూ పక్కమీద కూర్చున్నాను. ఇంతవరకూ జరిగిందంతా కలని తెలుసుకునేటప్పటికి నా కెట్లాగో అనిపిం

చింది. కొంచెం మంచినీళ్లు తాగి, దీపం కొద్దిగా ఎక్కించి మళ్లీ పరుపుమీద పడుకున్నాను కలంతా రికలెక్షన్ చేసుకుంటే మళ్లీ ఆకల పూర్తయితే బాగుండు ననిపించింది. కళ్లు మూసుకొని పడుకున్నాను. కల మళ్లీ రాలేదుగాని కొద్దిసేపట్లోనే మంచినిద్ర పట్టిపోయింది.

౪

మీర్జాసైకిలు మాఇంట్లోనే ఉందికాదూ! పదింటికల్లా వచ్చాడు. నేను అంతా తయారయి అతని కోసమే చూస్తూఉన్నాను. "మిస్‌శంపా"అని పిలిచాడు వాకిట్లోనుంచి. స్లూట్‌వాయిస్‌లాగా సోకింది ఆధ్వని నాకు. చరచర వాకిట్లోకి వెళ్లి షేక్‌హేండు ఇచ్చి లోపలికి తీసుకువచ్చాను. మీర్జాను చూస్తే రోజూలాంగా లేదు, ఇవ్వాళ. షేక్‌హేండ్ ఇచ్చేటప్పుడు రాత్రి కల్లో ఆచేతిని గుండెల్లో అదుముకున్న సంగతి జ్ఞాపకానికి వచ్చి చెయ్యంతా కంపించిపోయింది. హృదయంకూడ కలవరపడిపోయింది. ఆమనస్సంక్షోభం ముఖంమీదకూడ ప్రతిఫలించిందికాబోలు, మీర్జా నాముఖంవేపుకి తేరిపార చూచి "అదేమి, శంపా, ముఖమంతా అట్లా వాడిపోయిందేం?" అని అడిగాడు. అతని కేగొడవంతా ఏంతెలుసు, పాపం! నేను సరియైన సమాధాన మేమీ చెప్పలేదు. ఏదో మాటల్లో త్రోసివేశాను. ఇంతలో డ్రైవరు కారు తీసుకువచ్చాడు. "ఈపూటకి కారులో పోదాంలే, రా, ఇద్దరమూను. సాయంకాలం తీసుకుపోదువుకాని నీబైక్." మీర్జా సరేనన్నాడు.

మమ్మల్ని దింపివచ్చి నాన్నగారిని కోర్టుకు తీసికెళ్లాలిగనుక చాలా త్వరగా పోతున్నది మోటరు. అంతకంటె త్వరగా పరిగెత్తిపోతున్నది నాహృదయం. కారులోని ప్రదేశమంతా ఒకసారి చుట్టివచ్చింది. "శంపా"అని నాముఖందగ్గిర ముఖం చేర్చేటప్పుడు మీర్జాముఖం ప్రేమావేశంచేత గులాబీరం గెక్కి ఎంతమనోహరంగా కనుపించిందో తలుచుకునేటప్పటికి సంభ్రమంతో నిండిపోయినాను. ఇప్పుడుకూడ అట్లాగే ఉందా అతనిముఖం? తలఎత్తి చూచాను, అతనివైపు. ఆమెరిసేకండ్లు విశాలంగా తెరిచి గంభీరంగా ఏమిటో ఆలోచిస్తున్నాడు.

"మీర్జా" పిలిచాను. "ఏం" అన్నాడు, నావైపు తిరిగి. ఎందుకు పిలిచానో నాకే తేలేదు. కాని ఏదోచెప్పాలెగా. "ఏమిటి ఆలోచిస్తున్నావు?"

"నేనా? నీవింతసేపు మాట్లాడకుండా ఏమి ఆలోచిస్తున్నావోనని అనుకుంటున్నా." అన్నాడు మీర్జా. నాకు నవ్వు వచ్చింది. "రాత్రి నీవు చేసిన గమ్మత్తును ఆలోచిస్తున్నాను" అన్నాను నవ్వుతూనే. మీర్జా తెల్లబోయి నాడు—"గమ్మత్తుచేశానా రాత్రి నేను? ఏమిగమ్మత్తు?" అని అడిగాడు. "కాలేజీదగ్గిరకు వచ్చింది. ఇప్పుడు టైంలేదుగా. సాయంకాలం చెపుతాలే." అని సరిపుచ్చాను.

౫

కాలేజీ వదిలిపెట్టంగానే క్వీన్‌గార్డెన్‌లోకి వెళ్లాం. నీటిగొట్టంలోనుంచి పూలవాన గుసుస్తున్నది. ఆప్రక్కనే సున్నంతో కట్టిన సీట్లు ఉంటే దానిమీద కూర్చున్నాం. పైన ఆకాశం చాలా మనోహరంగా కనుపడుతూ ఉన్నది. ఆహా! ఆ మేఘాలు ఎంతచిత్రంగా ఉన్నయి! నిగనిగలాడుతూ నీలంగా మెరిసే ఆకాశంకిందిగా ఎన్ని మనోహరమైన దృశ్యాలు చిత్రించబడ్డయి! తెల్లగా నురుగులుగక్కుతూ ఒకదానిమీద ఒకటి విరుచుకుపడే సముద్రతరంగాలలాగు కొన్ని మేఘాలు, విచిత్రమైన జీవజంతువులవలె కొన్ని, గబగబ పరుగెత్తుతూ ఒకదానిమీద నొకటి పడి నెట్టుకుంటూ ఇదివరకటి ఆకారాలు మారి కొత్తఆకారాలు తెచ్చుకుంటూ కొన్ని మేఘాలు, నల్లగా భయంకరంగా కొండశిఖరాలలాగ కొన్ని, వాటి నెత్తిమీద బంగారుపూతవలె కొన్ని మేఘాలు, అబ్బబ్బ ఎంతని చెప్పగలం! ఒకరంగా! ఒకతీరా! అప్పటి ఆఆకాశాన్ని ఉన్నదున్నట్టుగా ఏవిఖ్యాతచిత్రకారుడైనా చిత్రింపగలడా? ఏసుప్రసిద్ధకవైనా వర్ణించగలడా?

ఆకస్మికంగా మీర్జా నావీపుమీద తట్టి "అన్నట్టు శంపా! ఇందాక నే నేదో మాజిక్ చేశానన్నావు కాదూ! ఇప్పుడు చెపుతావా?" అన్నాడు. మళ్లీ రాత్రి సంగతి జ్ఞాపక మొచ్చేటప్పటికి వళ్లంతా పులకరించిపోయింది. కాని మీర్జాతో ఏమిచెప్పాలె! ఏదో మాటల్లో తోసి వేద్దామనుకున్నాను. మాట వినిపించుకోనట్లు అపుడే బ్బురుమంటూ పైన పోతూ ఉన్న ఎయిరోప్లేన్ వైపు చూపుతూ "చూడు, మన కోసాంతవిమాన ముంటే ఇద్దరం కలిసి ఏకైలాసామౌన్టెన్స్‌కో వెళ్లి చూచిరా వచ్చునుగదా!" మీర్జాకు నవ్వువచ్చింది. "ఏమిటి అట్లా మాట్లాడుతున్నావు ఇవ్వాళ? కైలాసాస్‌మీదికి, హిమాలయాస్‌మీదికి వెళ్లుతున్న దేం బుద్ధి?" నాకూడా నవ్వు వచ్చింది. నేను చెప్పింది పిచ్చిసమాధాన మనుకున్నాను. అంతటితో ఆసంగతిని వదిలిపెట్టి జనరల్‌గా ఏమైనా మాట్లాడాలనుకున్నాను. ఏమీ పాలుపోక మతాన్ని గురించి మొదలుపెట్టాను.

"ఐతే మీర్జా, ఐడల్ వర్‌షిప్ అంటే మీకు పనికిరాదుగదా. అంతకాడికి మసీదులో కెళ్లి, నమాజు చేయడ మెందుకు? అదికూడ ఫిక్సెడ్ టైమ్స్‌లో అంతా వకచోట చెయ్యాలని ఎందుకు? ఎవరి ఇష్టమొచ్చినప్పుడు వాళ్లు, ఎక్కడపడితే అక్కడ చేసుకోకూడదు?"

"చూడు, శంపా, నీ కివ్వాళ మతంపిచ్చి పట్టిం దేం? ఏమీ పనిపాట లేక అనెంప్లాయ్‌మెంటు డిపార్టుమెంటులో తిరిగేరకమంతా తిని కూర్చోని వాళ్ల మతాన్ని, వీళ్ల మతాన్ని వెక్కిరిస్తూ కూచుంటారు. వాళ్లెలా ఏడిస్తే మన కేంకావాలి? మంచి ఆదర్శాలు ఎవరిమతంలో ఉన్నా మనం తీసుకుందాం. అసలిప్పుడు ఎవరైనాసరే ఏపనైనా ధైర్యంతో చేశారంటే దానికి మతం అడ్డమే రాదు. పోనీ మీఫాదరు ఇంతరిఫార్మరుగదా, మీ రెలిజను ఒప్పుకుంటుందా, నీ కిన్నాళ్లదాకా మారేజి చెయ్యకుండా చదువూ, గిదువూ చెప్పిస్తుంటే? మీబ్రామిన్సుంతా ఊరుకున్నారా లేదా?"

"ఊరుకోక చేసే దేముందిలే. ఇక వాళ్ల చేతుల్లో వుంది సోషల్ బాయ్‌కాట్ ఒకటి. దానికైనా సిటీస్‌లో భయం లేదు. ఐనా ఇప్పుడు మాలో బాగా తెలిసినవాళ్లెవరూ చదువు కభ్యంతరం పెట్టరు. ఎందుకంటే వేదకాలంలో, పురాణకాలంలోగూడ ఆడవాళ్లు బాగా చదువుకున్న వాళ్లే. కనుక నేను చదువుకున్నంతమాత్రాన నామత మెక్కడికీ పోదు."

"మరి ఇన్నిరోజులు పెండ్లిచేసుకోకుండా ఉన్నందుకో?"

"అదీని విరుద్ధంకాదు. మరీచిన్నపిల్లలకు పెళ్లి చెయ్యడం ఈమధ్య వచ్చిందికాని పూర్వం మాలోకూడ పెద్దవాళ్లకే పెళ్లిళ్లు చేసేవారు."

"ఐతే నీ విప్పుడు టెన్నిసుకోర్టులో జాయిన్ అయినావు కదా. ఆడవాళ్లు టెన్నీ సాడడ మేమిటని మీవాళ్లు ఎగతాళి చెయ్యరూ?"

"చేస్తారు, సంగతి తెలీక. టెన్నిసుకూడ పురాణకాలంలో నుండేదని ఎగ్జాంపిల్స్ ఉన్నాయి. కేవలం టెన్నిసేకాకపోయినా ఇట్లాంటిదే కందుకఖేలనమని ఒక ఆట గోల్డెన్‌బాల్స్‌తో ఆడవాళ్లు, మగవాళ్లు అంతా ఆడుతుండేవాళ్లు. కనుక కొంతమంది ఛాందసులు ఒప్పుకోకపోయినా నేను టెన్నిస్ ఆడుకోడం హిందూమతానికి విరుద్ధంకాదని చెప్పగలను."

మీర్జా నా ఉపన్యాసం వినేటప్పుడు కళ్లల్లో నవ్వు తొణుకాడుతూవున్నది. ఇంకేదో ప్రశ్న వెయ్యాలని, వెయ్యనా వద్దా అని ఆలోచిస్తున్నట్టు కనబడ్డాడు. ఒక్కక్షణ ముండి "సరేకాని శంపా, మరి ఇప్పుడు మీలో పెద్దవాళ్లు పనికిరాదంటారే, అన్నికులాలవాళ్ల ఇంట్లో భోంచెయ్యడం, ఎవర్నిబడితే వాళ్లని పెండ్లి చేసుకోడంకూడ మీ పురాణాల్లో ఉన్నాయనే అంటావా ఏమిటి?" అన్నాడు నవ్వుతూ.

"ఉన్నాయనే చెప్పాలిసివస్తుంది. సామాన్యంగా పురోహితులంతా బ్రాహ్మణులే ఉండేవాళ్లుకాని వాళ్లంతా రాజుల ఇళ్లల్లో భోంచేసేవాళ్లే. కనుక భోజనాల్లో పట్టింపు లేదని తెలుస్తుంది. తరువాత కొంతమంది శైన్ట్స్ రాజుకూతుళ్లని పెళ్లిచేసుకున్నారుకాని వాళ్ల బ్రాహ్మణత్వం పోలేదు. దేవయానఅనే బ్రాహ్మణస్త్రీ రాజును పెండ్లిచేసుకుంది. తరువాత చంద్రగుప్తుడు గ్రీకుగరల్ను పెండ్లిచేసుకున్నాడు. కాని వాళ్లనుత మెక్కడికీ పోలేదు. కనుక వేరేవేరే కులాలవాళ్లలో పెండ్లిండ్లుకూడ పూర్వం ఉండేవని తోస్తుంది."

మీర్జా నాబుజంమీద చెయ్యివేసి నిమురుతూ "శంపా, ఎమ్. యస్. సీ. కి చదువుతూకూడ ఈపురాణాలన్నీ ఎప్పుడు చదువుకున్నావు? నిజం చెప్పతున్నాను. మామతాన్నిగురించి ఇప్పటికి నాకు పూర్తిగా తెలేదు. నీవు ముందుముందు గొప్ప ఎగ్జాంపులరీ లేడీ వౌతావని తోస్తుంది. ఇక లే, చీకటిపడ్డది, పోదాం." అన్నాడు.

౬

మర్నాటినుండి మీర్జాముఖం ఆశాపూరితంగా కనుపించేది. ఇదివరకు ఎప్పుడు చూచినా ఏదో గంభీరంగా ఆలోచిస్తూ ఉండేవాడుకాని ఇప్పుడుమాత్రం చాలాసరదాగా, ఉత్సాహంగా మాట్లాడ్డం మొదలు పెట్టాడు. మాఇంటికికూడ మునుపటికంటే ఎక్కువగా వస్తూఉండేవాడు. ఒకరోజు నాన్నగారు మీర్జాను చూచి "రోజూ సైకిల్‌మీదనే వెళ్లుతావా కాలేజీకి?" అని అడిగారు. "ఔనండీ! మానాన్నగారి కారు ఎప్పుడూ కాలేజీవేళకు ఖాళీగా ఉండదు. ఎవరో ఒక పేషెంటును చూడ్డానికి వెళ్లుతుంటారు" అన్నాడు మీర్జా. "అలాగైతే రోజూ కాలేజీకి వెళ్లేటప్పుడు ఇక్కడికి వచ్చి శంపా, నీవూ కలసి వెళ్లుతూఉండండి, కారులో."

మీర్జా అభ్యంతర మేమీ చెప్పలేదు. మరునాటినుండి అలాగే జరుగుతూండేది. నేను మీర్జాను ప్రేమించడం నాన్నగారి కయిష్టంగా లేకపోవటమేగాక వారి ఉద్దేశ్యంకూడా అదే అయియుంటుందని కనుక్కోగలిగాను. అప్పటినుండి మాప్రేమ అనర్గళంగా వృద్ధిపొందుతూవచ్చింది. మీర్జాకూడ నన్ను గాఢంగా ప్రేమించుతున్నాడని తరువాత తెలుసుకున్నాను.

పరీక్షలయిపోయినవి. కాలేజీకి సెలవులు ఇచ్చినారు. ఇప్పుడుకూడ మీర్జా, నేనూ కలిసి పబ్లిక్ గార్డెన్‌లోకి పోతుంటాము, వాకింగుకు, సాయంకాలమప్పుడు.

ఒకనాడు మధ్యాహ్నం నాలుగు కావస్తూఉంది. ఇంకా చాలావేడిగానే ఉంది. నేను నాగదిలోనే సోఫామీద పడుకొనిఉన్నాను. ఎలక్ట్రిక్‌ఫాన్ తిరుగుతూంటే కాస్త ఊపిరి ఆడుతున్నది. ఒకప్లేట్ ఐస్‌క్రీము, ఒకకప్పు టీ తీసుకువచ్చి బాయ్ టేబిల్‌మీద పెట్టి వెళ్లాడు. నేను లేచి స్వానుతో ఐస్‌క్రీం తీసుకుంటున్నాను. ఇంతలో మీర్జా గబాగబా తలుపు నెట్టుకొని లోపలికి వచ్చాడు. ముఖమంతా చాలా కందిపోయింది. మనిషి చాలా ఆత్రంగా కనుపడ్డాడు. నేను వెంటనే చెయ్యిపట్టుకొని సోఫామీద కూర్చోపెట్టి "ఇదేం, ఇంత ఆదుర్దాగా ఉన్నావేం? ముందీటీ త్రాగు. కొంత శాంతిపడుతావు" అన్నాను. నాకుకూడ ఆత్రం నిండివచ్చింది. "అక్కరలేదు. ఇంటిదగ్గిర టీ త్రాగేవచ్చాను" అంటూ జేబులోనుంచి కర్చీఫ్ తీసుకొని ముఖం తుడుచుకుంటూ "సరే కాని శంపా, చూడు, ఇవ్వాళ పెద్ద చిక్కు వచ్చింది. నీ వేమి ఒపీనియన్ ఇస్తావోనని అడగడానికి వచ్చాను." అన్నాడు. "ఏమిటది?" అన్నాను, ఆత్రంతో. "నిదానంగా విను. లతీఫ్ హుస్సేన్ అని మాకు కొంచెందూరంబంధువున్నాడు. ఆయన కోకూతు రుందిట. ఆపిల్లని నాకిచ్చి మారేజి చేస్తానని మాఫాదరుతో చెప్పతున్నాడు. ఆయన ఒప్పుకునేటట్లే ఉన్నాడు. అందుకని నా కేమీ తోచక నీదగ్గిరకు వచ్చాను."

"ఎంతపిచ్చివాడివి, మీర్జా, నీవు? మీఫాదరుతో నాకీపెండ్లి వద్దని చెప్పితే తేలిపొయ్యేదికాదా! ఇంత ఆదుర్దాగా నాతో చెప్పడానికి వచ్చావెందుకు?"

"అదీచెప్పతాను. 'మరి నీకెందు కిష్టంలేదు' అని అడిగితే నీసంగతి చెప్పాలిసివస్తుంది. ఇంతా మావాళ్లంతా వప్పుకున్నతరువాత మీఫాదరుకు మన మారేజీ ఇష్టం లేకపొతే అప్పుడు మళ్లీ కష్టంగా ఉంటుంది. అందుకని నీ ఐడియా, మీఫాదర్సుఐడియా తెలిసివుంటే ఇక మావాళ్లని ధైర్యంగా ఒప్పించవచ్చు."

నేను వెంటనే మీర్జాను నాన్నగారివద్దకు తీసుకువెళ్లి సంగతంతా చెప్పవలె ననుకున్నాను. కాని వారప్పుడే క్లబ్బుకు వెళ్లిపోయినారు. సరి, నాన్నగారి ఉద్దేశం నాకు తెలిసేఉంది గనుక ధైర్యం తెచ్చుకొని "చూడు, మీర్జా, ఇన్నాళ్లనుండీ నీకు నాహృదయం తెలేనేలేదా? మానాన్నగారుకూడ ఇందుకు వ్యతిరేకంగా లేరు. అసలుసంగతేమిటంటే ఈ సమ్మరుహాలిడేస్‌లోనే మన మారేజీ చెయ్యాలని, రెండుమూడురోజుల్లో మీఇంటికి రావాలనుకుంటున్నారు. కనుక నీవు నిశ్చింతగా ఇంటికి వెళ్లి మీఫాదరును వప్పించు" అన్నాను. మీర్జా నారెండుచేతులూ తన గుండెల్లో పెట్టుకొని "శంపా, మాతండ్రి వప్పుకుంటాడని నమ్మకంలేదు. కాని మనకి పెండ్లయినా, కాకపోయినా నాహృదయంమాత్రం నీదే..." అన్నాడు.

"మీర్జా నా రెండుచేతులూ తన గుండెల్లో పెట్టుకొని......"

మీర్జాకంఠానికి దుఃఖం అడ్డుపడ్డది. కళ్లల్లో నీళ్లు నిండుకున్నాయి. వెంటనే నాకర్చీఫ్‌తో కళ్లుతుడిచి అతని తలకాయ నాఒళ్లో పెట్టుకొని "ఏమిటి మీర్జా, ఇంత అసమర్థుడిలాగా మాట్లాడుతావేం? పెండ్లిఅయితే అవుతుంది. లేకపోతే లేదు. ప్రపంచంలో పుట్టింది పెళ్లి చేసుకొడానికీ, పిల్లల్ని కనడానికి నేనా? ఇంతచదువు చదువుకున్నందుకు సంఘానికి, దేశానికి ఎంతసేవ చేస్తే నీరెస్పాన్స్‌బిలిటీ తీర్చుకున్నవాడి వవుతావు. ఇక చాలు, ఇంటికి వెళ్లి మీఫాదరుతో ఆలోచించు."

మీర్జా లేచి బయటికి వెళ్లాడు. బల్లమీది టీ చల్లారిపోయింది. ఐస్‌క్రీమంతా కరిగిపోయింది. మీర్జా విచారంచూస్తే నా హృదయంకూడ అలాగే కరిగిపోయింది. కాని పెండ్లివిషయంలో నాకుమాత్రం దిగులు ఏమీ లేదు. ఏమంటే మీర్జాకు నాహృదయా న్నర్పించాను. మీర్జాకూడ నన్ను మనస్ఫూర్తిగా ప్రేమించాడనవచ్చును. అటువంటప్పుడు మా ఇద్దరికి పెండ్లయితేనేమి, కాకపోతేనేమి? తరువాత నాన్నగారి ఉద్దేశమేమంటే సంస్కర్తలందరికి ఆదర్శంగా ఉండేటట్లుగా ఏమతాంతరుడికో, కులాంతరుడికో, లేక శాఖాంతరుడికో నా కిష్టమైనవాడుగా చూచి పెండ్లిచెయ్యాలని. నేటి కాలానికి వారి ఊహలన్నీ ఫలించేట్టుగా మీర్జా దొరికాడు. ఇక ఇప్పుడు నాకు, మీర్జాకు పెండ్లిచేసి హిందూ మహమ్మదీయసఖ్యానికి, సంస్కరణానికి మార్గదర్శకులు గావాలని నాన్న ఆశయం. ఇక అమ్మఉద్దేశం ఏమిటంటే, కేవలం నన్ను బ్రహ్మచారిణిగా ఉంచాలని. పెండ్లి చేసుకోంగానే మనుష్యులకు నిశ్శక్తి, నిర్జీవత కలుగుతుందని, హీనదశలో ఉన్న సంఘానికి, దేశానికి సేవ చెయ్యాలంటే విద్యావంతులు, బ్రహ్మచారిణులు ముఖ్యంగా కావాలని. ఇలాటిపరిస్థితులలో నాహృదయంలో

చాలారోజులనుండీ బ్రహ్మచర్యానికి, గార్హస్థ్యానికి యుద్ధం జరుగుతూన్నది. ఇన్నాళ్లకు నేనొకనిశ్చయానికి రాగలిగాను. మీర్జాను ఇప్పుడు నేను ప్రేమించాను. పైగా మీర్జా శాకాహారి, దేశాభిమాని, విద్యావంతుడు. అటు వంటప్పుడు సందర్భపడితే నాన్నగారి ఇష్టాన్ననుసరించి పెండ్లి చేసుకుంటాను. లేకపోతే ఏకారణంచేతనన్నా నాకూ మీర్జాకూ పెండ్లి సందర్భపడకపోతే అమ్మఇష్టాన్ననుసరించి బ్రహ్మచారిణిగా ఉంటాను.

౭

రాత్రి భోంచేస్తూ ఉండగా నాన్నగారు ఏదో మాటలమీద "ఇందాక ఎందుకమ్మడూ మీర్జా చెల్లి పడకముందే వచ్చాడు?" అని అడిగారు. నాకు చెప్ప డానికి సమయం దొరికింది. ఏమీ లేదండీ, అతనికేమో పెళ్లిట. ఎవరో వచ్చారుట, పిల్లనిస్తామని. తన కది ఇష్టంలేదని చెప్పాడు." నాన్నగారు ఉలిక్కిపడి "అలాగా?" అన్నారు. అంతే. మళ్లీ ఏమీ మాట్లాడలేదు....భోజనం కాగానే డ్రెస్‌చేసుకొని మోటారులో ఉస్మాన్‌జాగారి ఇంటికి వెళ్లారు. తరువాత గంటసేపట్లోనే తిరిగివచ్చారు. అక్కడ జరిగిన సందర్భ మిది: నాన్నగారు ఉస్మాన్‌జా గారితో సంగతిసందర్భములన్నీ చెప్పి మీకేమీ అభ్యంతరం లేకపోతే కొద్దిరోజుల్లోనే పెండ్లిచేద్దామని చెప్పి నారు కాని ఉస్మాన్‌జాగారు ఒప్పుకోలేదు. లతీఫ్ హుస్సేన్‌గారికి మాట ఇచ్చామనీ, ఇదివరకు వాళ్ల బంధువు లెవరూ హిందువుల పిల్లలను చేసుకోనలేదనీ, తానొక్కడే ముందుగా చేసినట్లయితే నలుగురిలో ఎగతాళిగా ఉంటుందనీ అభ్యంతరంచెప్పారు. నాన్న గారు ఎంతవాదనచేసినా ఒప్పించలేకపోయినారు. మీర్జా తండ్రిమాట ఎదిరించలేకపోయినాడు.

సరి, నాకు కొత్తగా విచార మేమీ పుట్టలేదు. ఇదివరకటి నిశ్చయాన్ననుసరించి అమ్మ ఇష్టప్రకారం బ్రహ్మచారిణిగా నుండాలని నిశ్చయించుకున్నాను.

తరువాత కొద్దిరోజులకే మీర్జాకు పెండ్లయిపో యిందని విన్నాను. అప్పుడుమాత్రం నామీర్జా ఇంకొకరి వాడయిపోయినా డనుకునేటప్పటికి ఏదో ఒకవిధమైన, చెప్పడానికివీల్లేని మనోవేదన కలిగింది. కాని దాన్నేమీ లెక్కచెయ్యలేదు. తరువాత మీర్జాకూడ ఎప్పుడూ నా కగపడలేదు.

రిజల్ట్సు తెలిశాయి. అనుకున్నట్టుగా నానంబరు మొదటితరగతిలోనే ఉంది. అందులో, యూనివర్సిటీకల్ల ఫస్టున వచ్చింది నేనొక్కదాన్నే అయినాను. నాన్నగారు చాలా సంతోషించారు. కొంతమంది స్నేహితులు నన్ను ఇంగ్లండు పంపమని సలహా నిచ్చారు. మా కాలేజీ స్త్రీ విద్యార్థినులంతా నాకొక టీపార్టీ ఇచ్చారు. మాకాలేజీ ప్రిన్సిపాలువద్దనుంచి ఇంగ్లండు పంపితే నెలకు ఎనిమిదిపౌనులు స్కాలరుషిప్ ఇస్తామని లెటరు వచ్చింది. సరి, అడ్డ మెవరు చెపుతారు? ప్రయాణానికి నాక్కావల సిన వన్నీ తయారయినాయి. స్నేహితులు, బంధువులు—అంతా బొంబే ఎక్స్‌ప్రెస్‌కు వీడ్కొల్పడానికి స్టేషన్ వద్దకు వచ్చారు. చాలామంది ప్రెస్ ఫోటోగ్రాఫరులు నాఫోటో తీసుకున్నారు. తరువాత రైలు సాగిపోయింది.

నాన్నగారు, అమ్మ బొంబేదాకా వచ్చారు. వాళ్లిద్దరి ప్రేమాశ్రువు తోటీ రాజపుటానా స్టీమరులో ఇంగ్లండుకు వెళ్లాను.

౮

మూడేళ్లయింది. డి. యస్. సి. డిగ్రీ తీసుకుని ఇండి యాకు తిరిగివచ్చాను. ఈమూడేళ్లలో నాలో ఏమీ ఎంచతగ్గ మార్పు కనుపించలేదు. ఇంగ్లండులోకూడ నేను శాకాహారినిగానే యుండేదాన్ని కాని మీర్జాచిత్రా న్నిమాత్రం నాహృదయంలోనుంచి తుడిచివెయ్యలేక పోయినాను. బ్రహ్మచారిణిగా ఉండాలనుకున్న నానిశ్చ యాని కేమీ భంగం రాలేదు కాని ఇదివరకటివలె నాతో మాట్లాడానికి మీర్జా లేకపోవడంచేత చాలా కష్టంగా ఉండేది.

నేను ఇంగ్లండు వెళ్లివచ్చానని నాన్నగారు పెద్ద పెద్దవాళ్లందరికి ఒక పెద్ద ఎట్‌హోమ్ ఇచ్చారు. దానికి అన్నిడిపార్టుమెంట్సులోని పెద్దఆఫీసర్లూ, డాక్టర్లు, వకీళ్లు, కౌన్సిలుమెంబర్లు జాతిమతభేదాలు లేకుండా హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, పార్శీలు, ఆంగ్లోఇండియనులు, యురోపియనులు చాలామంది వచ్చారు. మీర్జా రాలేదుకాని ఉస్మాన్‌జాగారుకూడ వచ్చారు.

అతిథుల్లో చాలామంది ముఖ్యులు నన్ను చాలా ప్రశంసించారు. ఉస్మాన్‌జాగారు లేచి నావల్ల సంఘానికి నూతనోత్తేజం కలగాలని వాంఛించారు. తరువాత నాన్నగారు సందర్భం పురస్కరించుకొని మీర్జాక్షేమం విచారించారు. సమాధానం వినేటప్పటికి నాగుండెలు బ్రద్దలయిపోయినయి. ఏమంటే, పెండ్లయినప్పటినుంచి మీర్జా చాలా జబ్బుగా నున్నాట్ట. ఇప్పుడు జబ్బ చాలా ఎక్కువగా ఉందట. ఆపెళ్లాం కాస్తా ఇతని నిరాదరణ భరించలేక ఆత్మహత్య చేసుకుందిట...ఉస్మాన్ జాగారి ముఖంలో చాలాపశ్చాత్తాపం కనపడ్డది. విందంతా అయిపోయి అతిథులంతా వెళ్లిపోయినతరువాత నాన్న గారితో చాలా దీనంగా ఇదివరకటి తన మాటలు మరచి పోవలసిందనీ, ఇంకా ఈట్వంటీయత్ శంచరీలోకూడ ఇతరు లేమనుకుంటారోనని అంతరాత్మ వప్పరున్న సంస్కరణాన్ని చెయ్యలేకపోయినందుకు తరువాత చాలా చింతించాననీ, ఇప్పుడు మరేమీ ఇబ్బంది లేక పోతే పెండ్లికి నాకేమీ అభ్యంతరం లేదనీ చెప్పారు. ఇంకా నాతో పెండ్లి కాకపోతే మీర్జా బతకడేమో నన్న భయాన్నికూడ కనుపర్చాడు.

నాన్నగారు మందహాసంతో అన్నిటికీ తలఊపారు. తరువాత నాతో అతని కారులోనే వెళ్లి మీర్జాను చూచిరమ్మని చెప్పారు. నేనుకూడ సరేనని ఉస్మాన్‌జా గారి కారులోనే బయలుదేరాను.

మేడమీద వరాండాలో ఈజీచైరులో పడుకొని ఉన్నాడు మీర్జా. సదా ఆలోచనాపూరితంగాఉండే ఆకోలకళ్లల్లో తేజస్సంతా ఇంకిపోయింది. ముఖమంతా జీవకళలు ఎండిపోయి తెల్లగా పాలిపోయింది. నున్నని చెంపలు శుష్కించి లోపలికి పీక్కుపోయినయి. మెట్లు మెట్లుగా కళ్లమీదికి పడుతూఉండే క్రాపంతా విపరీతంగా పెరిగి నాలుగువైపులా ఆవరించుకుంది. ఈస్థితిలో ఉన్న మీర్జా ఆకస్మికంగా నన్ను చూచేటప్పటికి స్తంభించిపోయినాడు. కళ్లనిండా నీళ్లు నిండిపోయినయి. తటాలున నేను వెళ్లి మీర్జాచేతుల్లో వాలిపోయినాను.

అస్థిచర్మావశిష్టంగా నున్న చేతుల్తో మీర్జా నన్ను గట్టిగా గుండెల్లో అదుముకుని శుష్కించిపోయిన కంఠంతో 'శంపా' అని తరువాత మాట్లాడలేకపోయినాడు. కళ్లల్లోనుండి నీళ్లు అనర్గళంగా ప్రవహించినయి...



"నేను లేచి కర్చీఫ్‌తో కళ్లు తుడిచి........."

నేను లేచి కర్చీఫ్‌తో కళ్లుతుడిచి "ఇలాచూడు" అని చెప్పబోతూఉన్నాను. ఇంతలో మీర్జాకళ్లు మూతలుపడిపోయినయి. అతితీవ్రంగా ఉన్న హృదయచలన మాగిపోయింది. ఇంకా చెప్పేదేముంది? నాప్రణయమూర్తి ప్రాణవాయువులు ఈమహావాయుసముద్రంలో విలీనమైపోయినయి.

* * * *

అంతటితో నాఆశ లడుగంటినయి. నాశక్తిలో సగం మీర్జాతో అస్తమించిపోయింది. నానాటికీ నిర్జీవత

ఎక్కువౌతున్నది. నేనూ మీర్జా కలిసి ఎన్నెన్నో ఘన కార్యాలు చెయ్యాలనుకున్నాం. అన్ని ఆశయాలూ మట్టిలో కలిసిపోయినయి. మీర్జాలాటి విద్యావంతుడు, దేశభక్తి ప్రపూరితుడు నైన యువకుణ్ణి కోలుపోయినందుకు దేశమాతకూడ దురదృష్టవంతురాలు.

ఇప్పుడు నేను మాఅమ్మఇష్టాన్ననుసరించి బ్రహ్మచారిణిగానే ఉండదలుచుకున్నాను. మాఊళ్లో ఒక హిందూముస్లింలీగు స్థాపించి నా శక్తంతా ధారపోసి హిందూమహమ్మదీయుల ఐకమత్యానికి పాటుపడుతున్నాను.

భ్రమ–ప్రమాదము

కొత్తపల్లి సూర్యారావుగారు

చేసిన నేర మిట్టిదని చెప్పి యొనర్చిన యాజ్ఞకొప్పి దీ
ర్ఘాపికిఁ గంరమిచ్చెద ననాదృతి కేమినిమిత్త మెన్నఁడుఁ
గోసిలియొగ్గి యుండి మనుదు న్భవదంఘ్రులయొద్ద నన్ను నే
బాస యొనర్పుమన్నను నవశ్యము సిద్ధము సోదెచూడుమా.

నీకారుణ్యము నమ్మి యెల్లపుడు నిన్నే దైవము న్బుద్ధితో
లోకాతీతవిధంబునం గొలిచి నీలో నున్న నన్నిన్ని నా
శ్లోకాగ్రంబుగఁ గాంచుచుం దెలియలేదే నాగుణం బక్కజం
బై కాన్పించుఁ దలంచువారలకు నీవ్యత్యాస మాత్మేశ్వరా.

సాంగత్యం బుపకారకంబు సకలాశామూలమౌ ప్రేముస
ర్వాంగాసేచనకంబు నీపొడవు భార్యారూపభాగ్యంబవం
చుం గొండాడెద వింతదాఁక నెఱమెచ్చులొప్పెలెఁ గన్పట్టు నీ
యంగారాత్మను ముగ్ధబుద్ధిని నవశ్యాయంబుగా నెంచితిన్.

పౌరుగూరన్ బహుగౌరవాదృతులతోఁ బొత్తై సుఖంబున్నవా
రిరువు రమ్మకొక బెంగ లే దనుచు సర్వైశ్వర్యంబుగా నున్న యి
ద్దఱు నీనాతలిదండ్రు లేమగుదురో దబ్బాటుగా విన్న నీ
త్వరితాకృత్యము గుండెబ్రద్దలయి వృద్ధత్వంబునం గుందరే.

ఏమని చెప్పువాఁడవొకొ హేతువు నీకెవరైనఁ గన్యనీ
రా మొదలింటి కాంత యపరాధ మదేమన నచ్చఁజెప్పు నే
నే మశిపూసవంటి తరుణీమణిఁ బెండిలిచేసి హాయిగా
నీమెయి వీడి చేసిన యకృత్యము దోషము నీఁగఁబోయెదన్.

అని క్రుద్ధుండయి యున్న నాథు నొక యాభార్యారత్న మగ్రస్థలి
న్వినయాంజల్యభిరామయై పలికి వేవేరీతుల న్వేఁడ న
న్ననలింపం దగ దేసు మిచ్చబడి నీనాయింటిలోనుండి నా
ననికిం బోవఁగ వేళ యయ్యె నిఁక నిల్వం, బల్క నొక్కింతయున్.

పసమది యెంత గావలయు వృశ్చికజం బఖిలాంగకంబులన్
బసృమరమౌ క్షణంబునను వేగమ పా మ్మిటనుండి పుట్టిని
య్మసలక చొచ్చి యుండు మట, మాటకు మాట తెవుల్నిజంబుగా
ముసలను మాట నిగ్గుటిచి నోటను మాటలు లేవు పల్కఁగన్.

చెఱిగిన మానసం బతుకువేసిన వేషిన యట్టులుండు న
ట్టారయట నంటఁగాఁగ దినుముంబలె నెన్నఁడు మచ్చ మాయునే
సరుపు శమించిన న్వదలుకొంటని నీయనుబంధ మేగు మొ
క్కరు వినకుండ మీఁద నెటుగాఁగలదో తలవ్రాలు తప్పునే.

భేదము లేనినాఁ డొకటి వీనిది వానిద యొండటంచు నా
లేదదె కల్గినప్పు డొక లేశముగానియు నన్యవస్తుసం
పాదనమందు నాసగొనఁ బాడియె నీదని తీసికొమ్ము నేఁ
గాదన నెద్దికావలయుఁ గంచము ముంతయుఁ బెట్టె బేడయున్.

వదలినఁ జాలు నే నరిగి వచ్చెదులోపలఁ గొమ్ము నీవి, నేఁ
బదిలముచేసికొందును స్వభాగము పిమ్మట నిర్వతాళము
ల్పదియగుచుండె నంచు జలపానముఁ జేయక నేగ శాలకున్
మదికిఁ జిరంబులేనపుడ మాత్రము సర్వ మసహ్యమే యగున్.